అనధికార ప్లాట్లు.. కొంటే పాట్లు!

- యలమంచిలి పట్టణంలో పుట్టగొడుగుల్లా లేఅవుట్లు
- ఐదు అనధికారిక వెంచర్ల గుర్తింపు.. హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- అక్రమ లేఅవుట్ల యజమానులకు నోటీసులు



యలమంచిలి ఎన్‌టీఆర్ కాలనీలో అనుమతులు లేని లేఅవుట్



మున్సిపల్ కార్యాలయంలో అక్రమ లేఅవుట్ల వివరాలను నోటీసు బోర్డులో పెడుతున్న అధికారులు

యలమంచిలి రూరల్: పట్టణ ప్రాంతాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వలసలు పెరగడంతో ఏటేటా ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలో నివాసయోగ్యమైన ప్రాంతాల్లో యలమంచిలి పట్టణానికి ప్రాధాన్యత ఉంది. దీన్ని అవకాశంగా చేసుకుని కొంత మంది రియల్టర్లు అనధికార లేఅవుట్లు ఏర్పాటు చేసి సొంతిల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలకు ఎర వేస్తున్నారు. వాస్తవానికి స్థిరాస్తి వ్యాపారులు నిబంధనల ప్రకారం లేఅవుట్లలో 10 శాతం స్థలాన్ని సామాజిక అవసరాలకు కేటాయించాలి. ఇదెక్కడా కనీసం మచ్చుకైనా కన్పించదు. ఇక రహదారులు కూడా సక్రమంగా నిర్మించడం లేదు. చాలా చోట్ల 20 అడుగులు, 15 అడుగులు, కొన్ని చోట్ల 10 అడుగుల కంటే తక్కువ వెడల్పులో రోడ్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. లేఅవుట్లకు ఫీజులు చెల్లించి అనుమతులు పొందకుండానే విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఘటనలూ ఉన్నాయి.

సెజ్‌తో భూముల ధరలకు రెక్కలు

మేజర్ పంచాయతీగా ఉన్న యలమంచిలి పట్టణం 2011 డిసెంబరులో మున్సిపాలిటీగా ఆవతరించింది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి, రాంబిల్లిలో నేవీ ఆల్టర్ నేటివ్ బేస్(ఎన్ఏవోబీ) ఏర్పాటుతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో మట్టి రోడ్లు వేసి, రాళ్లు పాతి వెంచర్లు వేశారు. మొదట్లో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అనుమతుల్లేని లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఈ లేఅవుట్లలో స్థలాలను పలువురు కొనుగోలు కూడా చేశారు. ఇప్పుడు వీటిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని అధికారులు తేల్చిచెప్పడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. అక్రమ లేఅవుట్లలో భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు కూడా కల్పించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. స్థలాలు కొనుగోలు చేసే ముందు ఆయా లేఅవుట్లకు అనుమతులున్నాయా? లేదా? అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఐదు అనధికారిక లేఅవుట్ల గుర్తింపు

అనధికారిక లేఅవుట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో తాజాగా ఐదు అనధికారిక లేఅవుట్లను అధికారులు గుర్తించారు. వాటి యజమానులకు నోటీసులు జారీ చేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ అక్రమ లేఅవుట్లలో స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయవద్దని అధికారికంగా సమాచారం ఇచ్చారు. యలమంచిలి పట్టణంలో ఎన్‌టీఆర్ కాలనీ సర్వే నంబర్ 66/8లో 1.14 ఎకరాలు, యర్రవరం సర్వే నంబరు 26లో 0.72 ఎకరాలు, సోమలింగపాలెం సర్వే నంబరు 136-1, 3లో 1.10 ఎకరాలు, కట్టుపాలెం సర్వే నంబరు 186-3ఏ-1సీ, 186-1ఏ-1లో 1.20 ఎకరాలు, పెదగొల్లలపాలెం సర్వే నంబరు 304లో 0.76 ఎకరాల్లో అనధికార లేఅవుట్లను స్థానిక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా యజమానులకు నోటీసులిచ్చామని టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు పురపాలక శాఖ లాగిన్‌లో సైతం అక్రమ వెంచర్ల వివరాలను నమోదు చేశారు. గత ఏడాదిన్నర కాలంలో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్ల వివరాలను మాత్రమే అధికారులు గుర్తించి, మీడియాకు తెలియజేయడంతో పాటు, కొన్ని పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారు. అంతకు ముందు సుమారు 37 అనధికార లేఅవుట్లను అధికారులు గుర్తించారు. ఇవన్నీ టీడీపీ నాయకులు, వారి అనుచరులు వేసినవి కావడంతో వాటి జోలికి మాత్రం అధికారులు వెళ్లకపోవడం విశేషం. తాజాగా గుర్తించిన ఐదు అక్రమ లేఅవుట్లలో ఇటీవల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ మేరకు ఫోటోలు తీసుకుని ఉన్నతాధికారులకు పంపించారు. అయితే ఏర్పాటు చేసిన మరుసటి రోజే అక్రమ లేఅవుట్ల యజమానులు ఆ హెచ్చరిక బోర్డులను తొలగించేశారు. ఈ లేఅవుట్లలో నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో లోలోన మథనపడుతున్నారు.



అనధికార లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనొద్దు



మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికా విభాగం ఇచ్చిన వివరాల ప్రకారం ఐదు అనధికారిక లేఅవుట్లు గుర్తించాం. అక్కడ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశాం. అక్రమ లేఅవుట్లలో ఎవరూ స్థలాలు కొనవద్దు. కొనుగోలు చేసినా అక్కడ ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోము. ఇంకా అనధికార లేఅవుట్లు ఉంటే నిబంధనల ప్రకారం గుర్తించి చర్యలు తీసుకుంటాం. ప్రజలు స్థలాలు కొనేటప్పుడే అనుమతులపై జాగ్రత్త వహించాలి.

– కస్తూరి విజయ్‌కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

క్లుప్తంగా

ఫార్మా, సెజ్ కార్మికులకు భద్రత కల్పించాలి



ముఠా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాము

అచ్యుతాపురం(మునగపాక): ఫార్మా, సెజ్ కార్మికులకు భద్రత కల్పించాలని సీపీఎం నాయకులు రొంగలి రాము కోరారు. ఫార్మా భద్రతతో పాటు కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షణ యాత్రను విజయవంతం చేయాలని కోరూతూ ఆయన మంగళవారం కార్మికుల సమావేశమయ్యారు. ఈ నెల 20న యాత్ర అచ్యుతాపురం చేరుకుంటుందని, అచ్యుతాపురం జంక్షన్‌లో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. పలు సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ధ్యానంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ధ్యాన గురువు రామప్పలనాయుడు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందలాపల్లి భగీరథ ఆలయ సమీపంలో మంగళవారం ధ్యాన మహాయాగంను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ధ్యానగురువు రామప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి రోజూ కొంత సమయాన్ని ధ్యానం కోసం కేటాయించాలన్నారు. ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. శ్రీగిజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిరమిడ్ వ్యవస్థాపకులు శివ గణేశ్వరరావు, ప్రసన్నకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

80 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల: నీలిగుంటలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది 80 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్టు గుర్తించి, వారిని బుధవారం హనుమంతవాకలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించనున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. 20 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్టు గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వై.నాగలక్ష్మి, ఎ.సంధ్య, ఎ.ఇందు, ఫీల్డ్ అసిస్టెంట్లు కె.వి.సురేష్, ఎస్.సంతోషి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత మూర్తి

యలమంచిలి రూరల్: జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. అబ్బాయిశెట్టి జ్ఞాపకార్థం అతని కుమారుడు మూర్తి విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీహెచ్ శాస్త్రి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి

మునగపాక: నాగులాపల్లిలో లో-ఓల్టేజీ సమస్య లేకుండా చూడాలని కోరుతూ మంగళవారం అనకాపల్లి విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పలు గృహోపకరణాలు దెబ్బతింటున్నాయంటూ వినతిలో పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన ఈఈ.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సామాజిక కార్యకర్త కర్రి వాసు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



అచ్యుతాపురం జెడ్పీ హైస్కూల్‌లో పీఈటీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం మండల పీఈటీలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రికెట్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర క్రీడలకు అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఇచ్ఛా ఫౌండేషన్‌కు సాయం



ఇచ్ఛా ఫౌండేషన్ పిల్లలతో సోషల్ సర్వీస్ గ్రూప్ సభ్యులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్ పిల్లలకు అనకాపల్లికి చెందిన సోషల్ సర్వీస్ గ్రూప్ సభ్యులు రూ.14వేలు విలువ చేసే సామగ్రిని మంగళవారం అందజేశారు. ఫౌండేషన్‌లో చదువుకుంటున్న వికలాంగ పిల్లలకు అవసరమయ్యే డైపర్లు, మందులు, పాలు, పెరుగు, తదితర సరకులను పంపిణీ చేశారు. గ్రూపు సభ్యుడు ఎంబీవీ స్వామి జయంతి సందర్భంగా గ్రూపు అధ్యక్షుడు కేవీ గౌరీపతి, వీరభద్రరావు, బుద్ధ సింహాచలం నాయుడు తదితరులు సాయం అందించారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని మరువలేమని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

తమలపాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.వి.ప్రసాద్

పాయకరావుపేట: తమలపాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో మంగళవారం తమలపాకు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమలపాకు రైతుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడాలని సూచించారు. తమలపాకు పంటకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలన్నారు. మిగిలిన పంటలు వలే బీమా సౌకర్యం కల్పించాలన్నారు. తమలపాకులను గ్రేడింగ్ చేసుకునేందుకు షెడ్లు నిర్మించాలని, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, మద్దతు ధర ప్రకటించాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. రైతు సంఘం జాతీయ సమితి సభ్యులు రావు జగ్గారావు, అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల మాతినాయుడు, వీసీబీ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహనరావు, రౌతు రామచంద్ర, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, స్థానిక తమలపాకు రైతులు పాల్గొన్నారు.

'పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కరవు'



రక్షణ యాత్రకు యలమంచిలిలో స్వాగతం పలుకుతున్న ప్రజా సంఘాల నాయకులు

యలమంచిలి రూరల్: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల భద్రతకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాళ్ల లోకనాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత కోసం సీపీఎం తలపెట్టిన రక్షణ యాత్ర మంగళవారం యలమంచిలి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు యాత్రకు సాదర స్వాగతం పలికారు. అచ్యుతాపురం పరిశ్రమల్లో వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల పరిశ్రమల్లో చోటు చేసుకుంటున్న వరుస ప్రమాదాలతో కార్మికుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతకాయల శివాజీ, జి.కోటేశ్వర్రావు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



మునగపాక హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి



విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: నులి పురుగుల నివారణకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ మాత్రలతో పిల్లల్లో వచ్చే రక్తహీనతను అరికట్టి తద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని సీహెచ్‌వో దేవకాంత తెలిపారు. ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఎంఈవో వేణుగోపాలరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూరి చంద్రరావు, వైస్ చైర్మన్ బొడ్డేడ గిరిజ మహేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలో 14,000 మంది పిల్లలకు ఆల్బెండజోన్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎ.సాంబశివరావు, ఎ.ఎస్.గాంధీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.రాయవరం అంగన్‌వాడీలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాలకు రాని విద్యార్థులకు ఈ నెల 25న మరోసారి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎస్‌వీఎస్ ప్రసాద్, టి.టి.నాగేశ్వరరావు, వై.సూర్యకుమారి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం హైస్కూల్‌లో విద్యార్థులతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఎంఈవో దేవరాయల్, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాయకరావుపేట: బాలికల పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

మెరుగైన పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్
- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ప్రారంభం



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: గ్రామాలు, పట్టణాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా సహకరించాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం యలమంచిలి పురపాలక సంఘం కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కస్తూరి విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛత హీ సేవ

మునగపాక: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మూలపేట గ్రామంలో మంగళవారం ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు పిచ్చి తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, యల్లపు నాయుడు, భీశెట్టి నాగేశ్వరరావు, ఆడారి కాశీ, కాండ్రేగుల నాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మూలపేటలో పారిశుధ్యం మెరుగు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిశుభ్రత, ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించాలని, కాలుష్యరహిత సమాజం కోసం మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ చేశారు.



కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఆశ కార్యకర్తలు, విద్యార్థులు

పాయకరావుపేట: మండలంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ప్రారంభమైనట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.గాంధీ, ఈవోఆర్‌డీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, లారీ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

నక్కపల్లి: మండలంలో డీఎల్‌పురం సమీప ప్రాంతాల నుంచి అనధికారికంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక లారీని నక్కపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు నిబంధనలకు విరుద్ధంగా రెండు ట్రాక్టర్లు, లారీలో ఇసుక రవాణా చేయడాన్ని గుర్తించామని సీఐ కుమారస్వామి తెలిపారు. డీఎల్‌పురం వద్ద ట్రాక్టర్లను, ఉపమాక రోడ్డు జంక్షన్ వద్ద లారీని పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, అపరాధ రుసుం విధించినట్లు సీఐ తెలిపారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షల మంజూరు



జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణతో ముసిలితల్లి మూల సంఘ రైతులు

మునగపాక: మునగపాక ముసిలితల్లి మూల సంఘ పరిధిలోని రైతుల కమతాల్లోకి వెళ్లేందుకు వీలుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం రాత్రి ముసిలితల్లి మూలసంఘ రైతులు ఆయనను కలిసి పెంటకోట త్రినాథరావు పొలం నుంచి పొలిమేర చెల్లయ్యనాయుడు పొలం వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన.. రైతులకు మేలు జరిగేలా గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రైతులు వేగి కృష్ణ, ఆడారి సత్యనారాయణ, ఆడారి నాగు, వెలగా దుర్గనాయుడు, ఆడారి కోటిబాబు, వేగి శ్రీనివాసరావు, ఆడారి జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

మునగపాక: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు, కూటమి నేతలు మళ్ల కాలేశ్వరరావు, టెక్కలి పరశురామ్, కర్రి సాయికృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నక్కపల్లి: మోదీ జన్మదినం సందర్భంగా నక్కపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరు శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు వీరబాబు, నాగమణి, విజయ్, వాసు, శివకృష్ణ, నానాజీ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పప్పు ఈశ్వరరావు, నక్కా శివశంకరరావు, పిట్టా దాసుబాబు, చెక్కా శ్యామ్, బొద్దపు శివ పాల్గొన్నారు.

అచ్యుతాపురం(మునగపాక): పీఎం మోదీ జన్మదిన వేడుకలను అచ్యుతాపురంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, దొప్పెర్ల సర్పంచ్ కోరుప్రోలు చిన్నారావు, పార్టీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు, నునపర్తి సర్పంచ్ చుక్కా అనురాధ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



నక్కపల్లిలో కేక్ తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

చెట్ల పెంపకంతో ఓజోన్ పొరకు రక్షణ



మొక్క నాటుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ

నక్కపల్లి: ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వినియోగంతో క్లోరోఫ్లోరో కార్బన్లు విడుదలై ఓజోన్ పొర దెబ్బతింటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీమన్నారాయణ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఓజోన్ పొర ఎలా దెబ్బతింటుంది.. వాతావరణంలో తలెత్తే మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల పెంపకంతో ఓజోన్ పొరను రక్షించుకోవచ్చన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటేషన్ నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.విజయలక్ష్మి, గాడి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.